పొంగిపొర్లిన కాలువలు

– వ్యాపారులు, ప్రజలకు అసౌకర్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురికినీటి కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా పటేల్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకూ ఎడమ వైపు ఉన్న మురికి కాలువలోంచి నీరు పొంగి రోడ్డుపైకి వచ్చింది. దీంతో ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్ ప్రక్కనున్న షాపురూముల వద్ద మురికినీరు నిలవడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇన్‌గేట్ వద్ద కూడా అదే పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో భారీగా నీరు నిలవడంతో షాపురూముల వారికి ఇబ్బంది ఏర్పడింది. రహదారులపై నీరు నిలవడం వల్ల వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండు చుట్టూ చిన్న కాలువలు, అప్రోచ్ సరిగా లేకపోవడం వల్లే పదే పదే డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఈ కాలువలను పునర్నిర్మించాలని వారు కోరుతున్నారు.




ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్ ప్రక్కన కాలువల్లోంచి పొంగి షాపురూముల ముందు నిలిచిన మురికినీరు

విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో రహదారుల విస్తరణ, నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చే యాలని కేఎంసీ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మాసాపేట, దేవునికడప రోడ్, గోకుల్ లాడ్జి–క్రిష్ణా సర్కిల్ రోడ్లలో జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాసాపేట రోడ్డులో పెడస్టల్స్ అమర్చి వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలన్నారు. దేవునికడప రోడ్డులో ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. దేవునికడప సర్కిల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, డీసీ రోడ్డులో మాచుపల్లె బస్టాండు ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టాలన్నారు. గోకుల్ లాడ్జి సర్కిల్‌ను మరమ్మతులు చేయాలన్నారు. రెండు రోజుల్లోగా ఆ మార్గంలోని అన్ని బిల్డింగ్‌లను తొలగించాలన్నారు. అనంతరం డ్రైనేజీ కాలువలు, డివై డర్ నిర్మాణ పనులను మొదలు పెట్టాలన్నారు. అల్మాస్ పేట సర్కిల్‌ను నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడున్న ఫౌంటేన్‌కు, సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని సూచించారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

ఆరోగ్య పరీక్షలు

కడప కార్పొరేషన్ / కడప అర్బన్ : కడప నగరంలోని పారిశుద్ధ్య కార్మికులు, సఫాయి కర్మచారీలకు రిమ్స్ ఆసుపత్రిలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 26వ తేది నుంచి అక్టోబర్ 6వ తేది వరకూ ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్ల ద్వారా రోజుకు 150 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వారిని ప్రత్యేక వాహనంలో రిమ్స్‌కు తీసుకుపోయి పరీక్షలు చేయించి మళ్లీ తీసుకురావడం జరుగుతుందన్నారు. కార్మికులంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మూడో విడత డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

వైవీయూ : ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మూడో విడత అడ్మిషన్లు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం కడప ఆర్ట్స్ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి, రెండో విడత ఆప్షన్లు వినియోగించుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డా. ఎం. రమేష్‌ను 9177682848, మనోహర్‌రెడ్డి 8919818677 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోషకాహారం తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మంచి పోషకాహారం తీసుకోవాలని కడప అర్బన్ సీడీపీఓ సునంద తెలిపారు. మంగళవారం పోషణ్ మాసోత్సవాల సందర్భంగా నగరంలోని ఎర్రముక్కపల్లె, నాగరాజుపేట సెక్టార్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రేణుక, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక



జిల్లా బాలికల జట్టుతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి మహిళల బాస్కెట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను కడప మండల విద్యాశాఖాధికారి పాలెం నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు: సాయికుమారి, జయశ్రీ, గౌతమి, దివ్యశ్రీ, సాయికళ, ప్రసూన, శిరీష, మాబి, మౌనిక, చంద్రిక, అఫ్రిన్, రిజ్వానా, రజియా.

భక్తిశ్రద్ధలతో ఆషారే షరీఫ్ దర్శనం



కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలో మిలాదున్నబీ పవిత్ర మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ముస్లిం ప్రముఖులు ఆసారే షరీఫ్ దర్శనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అస్తానె బుఖారియా పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బుఖారి సాహెబ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సూచనల మేరకు భక్తులు ఆషారే షరీఫ్‌ను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిర్వాహకులు ఫాతెహా చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సంస్థ అధ్యక్షులు సయ్యద్ మగ్దూమ్ బుఖారి సాహెబ్,కోశాధికారి సలీంబుఖారి సాహెబ్, స్థానిక ముస్లింలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కలశ స్థాపన నిర్వహించి స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు, టీటీడీ వేద పండితుల బృందాలు మంగళ వాయిద్యాలతో పల్లకీని ఊరేగింపుగా పుష్కరిణి వద్దగల పుట్ట వద్దకు తీసుకెళ్లారు. పూజలు నిర్వహించిన అనంతరం పుట్ట మన్ను సేకరించి పల్లకీలో ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు తివిక్రమ్, కృష్ణమోహన్‌ల ఆధ్వర్యంలో పండితుల బృందం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచనం నిర్వహించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత సాధ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : డ్రైవర్లు ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని కడప ఓం శాంతి బ్రహ్మకుమారి ప్రతినిధి కావ్యఅక్కయ్య తెలిపారు. మంగళవారం కడప నగరంలోని డీపీటీఓ కార్యాలయంలో డ్రైవర్లకు ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సును నడిపే డ్రైవర్ తనతోపాటు కుటుంబ సభ్యులు, ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వర్తించాల్సి ఉందన్నారు. ఆర్టీసీకి ప్రమాద రహిత సంస్థగా పేరు తీసుకు రావాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్ వృత్తి నిత్యం ఒత్తిడితో కూడుకున్నదని, అలాంటి వారు ధ్యానం చేయడం ద్వారా ప్రశాంతంగా ఉండవచ్చన్నారు. డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్, జమ్మలమడుగు డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇంధన పొదుపు పాటించడం వల్ల సంస్థను లాభాల బాట పట్టించవచ్చన్నారు. డ్రైవర్ సత్ ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్‌కే రెడ్డి, ఎస్ఎంఏజీ బాష డ్రైవర్లకు ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు.



డ్రైవర్లకు ధ్యానం గురించి వివరిస్తున్న కావ్య అక్కయ్య

ఆడ, మగ ఇద్దరూ సమానమే



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : మగపిల్లలకన్నా ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని, మగ పిల్లలతో పాటు ఆడ పిల్లలు కూడా సమానమేనని ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆడపిల్లల శాతం తక్కువగా ఉన్న పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయించుకుంటున్నారా? అనే విషయాలపై దృష్టి సారించాలన్నారు. హై రిస్క్ గర్భవతులను రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు రమేష్‌రెడ్డి, డిప్యూటీ డెమో రమణమ్మ, డీపీహెచ్ఎన్ఓ అరుణకుమారి, హెచ్ఈ కుమారి, మౌనిక, మల్లయ్య, పాలేశ్వరరావు, పీసీపీఎన్‌డీటీ కన్సెల్టెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై ఆసక్తి పెంచుకోవాలి

వైవీయూ : పర్యాటక రంగం పట్ల ఆసక్తి, అవగాహన పెంచుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రిన్సిపాల్, జిల్లా టూరిజం కౌన్సిల్ సభ్యులు ఆచార్య జి. సాంబశివారెడ్డి సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఆయ న ముఖ్యఅతిథిగా విచ్చేసి జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి గురించి వివరించారు. జిల్లా టూరిజం అధికారి మల్లికార్జున, కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, టూరిజం మేనేజర్ రామ్‌కుమార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎకో టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ గురుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య సాంబశివారెడ్డి

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పరిపాలనలో బీజేపీ విఫలం

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలన చేయడంలో విఫలం అయిందని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంలోని బీజేపీ అప్రజాస్వామిక విధానాలను మోస్తున్నాయని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీల పెంపు సరికాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. మోయలేని పన్నుల భారాన్ని వేయడం తగదన్నారు. ఈ సమస్యలపై వామపక్ష పార్టీల ఉమ్మడి ఛలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

కడప వైఎస్సార్ సర్కిల్: రానున్న ఎన్నికలలోపు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమన్వయ కమిటీ కన్వీనర్లతో సమీక్ష ఎసమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థను గ్రామ పంచాయితీలు, అర్బన్ బాడీస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కన్వీనర్లు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మౌఖిక పరీక్ష

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఆరో సెమిస్టర్ లాంగ్‌టర్మ్ ప్రాజెక్టు పూర్తిచేసి మౌఖిక పరీక్ష (వైవా–వాయిస్)కు హాజరుకాలేకపోయిన విద్యార్థులకు ఈనెల 27వ తేదీన కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉన్నతచదువులకు వెళ్లడానికి అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో వారికి మౌఖిక పరీక్షకు మరో అవకాశం ఇస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మౌఖిక పరీక్షకు నమోదు చేసుకున్న విద్యార్థుల ప్రాజెక్టు రిపోర్ట్, హాల్‌టికెట్, కళాశాల గుర్తింపుకార్డు తప్పక వెంట తీసుకురావాలని సూచించారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు



కడప సెవెన్‌రోడ్స్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ బైఠాయించారు. కలెక్టర్‌ను కలిసేందుకు లోనికి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకుని పలువురు నాయకులను అరెస్టు చేసి వన్‌టౌన్‌కు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌కుమార్, రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను అరెస్టుచేయడం అన్యాయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాహుల్, రవి పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల్లో విద్యార్థులకు వండే వంటల్లో నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆదేశించారు. మంగళవారం వైవీయూలోని పురుషుల, మహిళల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీలో వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను, ప్యాకెట్లపై ఉన్న తయారీ, వినియోగపు తేదీలను, లేబుళ్లను పరిశీలించి వాడాలని సూచించారు. వసతిగృహ విద్యార్థుల కోసం 5 షటిల్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం బోధనేతర సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. పీజీ పరీక్షల సమాధాన పత్రాలు మూల్యాంకనానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

డ్రైవింగ్‌లో అత్యుత్తమ శిక్షణ



శిక్షణ పొందుతున్న డ్రైవర్లతో డీఎం డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డిపోలో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని, దీనిని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు 17వ బ్యాచ్ అభ్యర్థులకు శిక్షణను ఆయన ప్రారంభించి స్టడీ మెటీరియల్ అందజేశారు. డీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు 16 బ్యాచ్‌లు పూర్తి చేసుకుని 17వ బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. 18వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవంగల రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గ్యారేజీలో సుదీర్ఘ అనుభవంగల మెకానిక్‌లచే వాహన విడిభాగాలు చూపించడం, వాటి పనితీరు, సామర్థ్యం, బస్సు స్టీరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఇక్బాల్ రైస్‌మిల్ సమీపంలో ఆగి ఉన్న కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మైదుకూరుకు చెందిన చెన్నయ్య ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదవశాత్తు ఆగి ఉన్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చెన్నయ్యను పోలీసులు రిమ్స్‌లో చేర్పించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ విజయానికి కృషి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికలు రానున్న నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులు పార్టీ విస్తరణ కోసం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ల కమిటీలు వేయాలని, అలాగే పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని పాత బస్టాండులోని వీహెచ్‌పీ భవనంలో ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అందులో భాగంగా ఈనెల 28, 29, 30 తేదీలలో అన్ని మండలాలలో మూడు రోజులపాటు ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వచ్చేనెల మొదటి వారంలో కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు అందించకపోవడాన్ని నిరసిస్తూ ఆయకట్టు రైతులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నాచేయాలని తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, జిల్లా ఇన్‌ఛార్జి దుద్దికుంట వెంకటేశ్వర రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు పుప్పాల శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిషేధ కమిటీ ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఆలంఖాన్‌పల్లె–2 పరిధిలోని వార్డు సచివాలయంలో బాల్య వివాహ నిషేధ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి వినోద్‌కుమార్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కెతుర మాట్లాడుతూ ఈ బాల్య వివాహ నిషేధ కమిటీల ద్వారా బాలబాలికలకు గ్రామ స్థాయి నుంచి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. వార్డు స్థాయిలో వార్డు కార్పొరేటర్ చైర్ పర్సన్‌గాను, మహిళా పోలీసు కన్వీనర్‌గా, వీఆర్వో, ఏఎన్ఎం, అడ్మిన్, ఎస్‌హెచ్‌జీలు, అంగన్వాడీ వర్కర్లు, ఎన్జీఓలు మెంబర్లుగా వ్యవహరిస్తారన్నారు. మహిళా పోలీసు మంజుషా, వీఆర్వో సుబ్బరాయుడు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, ఆర్పీలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞానానికి బోధనే మంచి సాధన

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి విజ్ఞానానికి బోధనే మంచి సాధన అని కడప మండల ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్ అన్నారు. మంగళవారం కడప నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల సముదాయ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులకు మాతృభాష ప్రాథమిక అంశాలైన వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం, గణిత చతుర్విధ ప్రక్రియలను పిల్లలకు సరళమైన విధానంలో అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సముదాయ హెచ్ఎం పుష్పలత, రిసోర్స్ పర్సన్స్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలోచన ఉన్నతంగా ఉండాలి



మాట్లాడుతున్న మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్

కడప ఎడ్యుకేషన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల ఆలోచన చాలా ఉన్నతంగా ఉండాలని మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్ అన్నారు. కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండెక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కెరీర్ గైడెన్స్‌పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ డాక్టర్ హాకీముద్దీన్, విలయత్ అలీబైగ్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ ప్రారంభ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్వర్ణోత్సవ సభకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ విజయవాడ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట



లడ్డూను దక్కించుకున్న భక్తుడు

కడప కల్చరల్: కడప నగరం మృత్యుంజయకుంట రాజులవీధిలోని గణపతి విగ్రహం వద్ద ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన లడ్డూ ప్రసాదం వేలం పాట పోటాపోటీగా సాగింది. తొమ్మిది రోజుల నిమజ్జనం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక స్టోర్ డీలర్ బాలరాజు సాయిరాజు ... గణపతి స్వామి 30 కిలోల ప్రసాదం లడ్డూను రూ. 1.12 లక్షలకు దక్కించుకున్నారు. దీంతోపాటు వేలం వేసిన ప్రత్యేకమైన ఖవ్వా లడ్డూను భక్తులు చిరంజీవి రూ. 61 వేలకు దక్కించుకున్నారు. అనంతరం భక్తులు స్వామి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

మెరుగైన సేవలందించాలి



మూలవంకలో చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారీ చేసే కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమణ

కడప అగ్రికల్చర్: వ్యవసాయ పంటలసాగులో రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రమణ సూచించారు. మంగళవారం ఆయన కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి కేవీకే సాంకేతిక కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కేవీకే సాంకేతిక సహకారంతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల తయారీ కేంద్రాన్ని సందర్శించి వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆయన ఖాజీపేట మండలం చెముల్లపల్లెలో పసుపు పంటలోని లామ్ స్వర్ణ రకంను సందర్శించి రైతుల స్పందన తెలుసుకున్నారు. తుడమలదిన్నెలో పత్తి పంటలో గులాబీ పురుగు నివారణ కోసం ఆచరిస్తున్న సమగ్ర సస్యరక్షణ పద్ధతుల క్షేత్ర ప్రదర్శనలను సందర్శించి ఈ ప్రయోగం ఫలితాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.